క్లుప్తంగా

కొనసాగుతున్న ప్రతిష్ఠోత్సవాలు



నూతన శ్రీ గౌరీనాథ కేదార్‌నాథ్ ఆలయం

నంద్యాల(వ్యవసాయం): పట్టణంలోని రైతునగర్ సమీపంలో నూతనంగా నిర్మించిన శ్రీగౌరీ కేదార్‌నాథ్ స్వామి ఆలయ ప్రారంభోత్సవం, విగ్రహ ప్రతిష్ఠోత్సవాలు శనివారం ప్రారంభం కాగా, ఆదివారం ప్రత్యేక పూజలు కొనసాగాయి. ఉదయాన్నే వేదపారాయణం, వాస్తు పూజ, హోమం, తదితర కార్యకార్యక్రమాలు నిర్వహించారు. సాయంత్రం ప్రతిష్ఠ విగ్రహాలను పట్టణంలో ఊరేగించారు. ఆలయ కమిటీ సభ్యులు మాట్లాడుతూ నాలుగు రోజుల పాటు వేడుకలు నిర్వహిస్తామని, చివరి రోజు బుధవారం విగ్రహాలను ప్రతిష్ఠించి ప్రత్యేక పూజలు చేపట్టి, హోమాలు నిర్వహించి పూర్ణాహుతి గావించి వేడుకలను ముగిస్తామని చెప్పారు. ప్రతి రోజూ సాయంత్రం కోలాటం , భజనలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

ఎస్పీని కలిసిన పాణ్యం సీఐ



ఎస్పీని కలిసిన పాణ్యం సీఐ నల్లప్ప

బొమ్మలసత్రం: నంద్యాల జిల్లా పాణ్యం సీఐగా నల్లప్ప ఆదివారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ కె.రఘువీర్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. నల్లప్ప కర్నూలు జిల్లా ఉలిందకొండ ఎస్‌ఐగా విధులు నిర్వహిస్తుండగా.. ఉన్నతాధికారులు ఆయనకు సీఐగా పదోన్నతి కల్పించి పాణ్యంకు బదిలీ చేశారు. ఈ నేపథ్యంలో ఆదివారం విధుల్లో చేరారు.

వైభవంగా అన్నపూర్ణాదేవి కల్యాణం



కల్యాణం నిర్వహిస్తున్న దృశ్యం

శ్రీశైలం: శ్రీశైల క్షేత్రంలోని శ్రీశ్రీశ్రీ అన్నపూర్ణాదేవి గృహస్థాశ్రమంలో ఆదివారం శ్రీ అన్నపూర్ణాదేవి సమేత సనారీ విశ్వేశ్వర స్వామి వార్ల కల్యాణ మహోత్సవం వైభవంగా జరిగింది. ఆశ్రమ నిర్వాహకులు, శివోహం టెంపుల్ ట్రస్ట్ నిర్వాహకులు అరవింద రెడ్డి ఆధ్వర్యంలో కల్యాణం నిర్వహించారు. కొన్ని ఆశ్రమాల పీఠాధిపతులు, గురుబిడ్డలు, గురు భక్తులు, సాధువులు కార్యక్రమంలో పాల్గొన్నారు. అదేవిధంగా లక్ష్మీ గణపతి హోమం, చండీ రుద్రం, మృత్యుంజయ హోమాలు నిర్వహించారు. అనంతరం రాత్రి భజన కార్యక్రమం జరిగింది.

మహానందిలో సండే సందడి



క్యూలైన్లలో వేచి ఉన్న భక్తులు

మహానంది: సెలవు రోజు కావడంతో ఆదివారం మహానందిలో భక్తుల సందడి నెలకొంది. రెండు తెలుగు రాష్ట్రాల నుంచి భక్తులు ఆలయానికి అధిక సంఖ్యలో తరలివచ్చారు. శ్రీ కామేశ్వరి దేవి, శ్రీ మహానందీశ్వర స్వామి వార్లను దర్శించుకుని అభిషేకం, కుంకుమార్చన పూజలు చేపట్టారు. ఉదయం, సాయంత్రం జరిగిన అభిషేకం, అష్టవిధ మహా మంగళ హారతుల సమయంలో భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. ఉదయం నుంచి రాత్రి వరకు మహానందీశ్వర స్వామి దర్శనం నిర్విరామంగా కొనసాగింది. ఈఓ కాపు చంద్రశేఖర్ రెడ్డి భక్తుల రద్దీకి అనుగుణంగా ఏర్పాట్లు పర్యవేక్షించారు.

అరబిక్ విద్యార్థులకు పట్టాల ప్రదానం



దువా చేస్తున్న ముస్లిం మత గురువులు

వెలుగోడు: పట్టణంలోని జామియా సిరాజుల్ ఉలుమ్ అరబిక్ కళాశాలలో గత పది సంవత్సరాల నుంచి అరబిక్ విద్యను పూర్తి చేసిన విద్యార్థులకు పట్టాల ప్రదాన కార్యక్రమం ఆదివారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా బెంగళూరు నగరానికి చెందిన హజరత్ మౌలానా ముఫ్తీ సాగీర్ అహమ్మద్‌ఖాన్, అతిథులుగా పీఎం మహమ్మద్ ముజమ్మిల్, మహమ్మద్ గౌస్ హాజరయ్యారు. కార్యక్రమంలో హాఫిజ్, అలీమ్, ఖారీ కోర్సులు పూర్తి చేసిన 118 మంది పట్టభద్రులకు పట్టాలు ప్రదానం చేశారు. అనంతరం సామూహిక దువా చేశారు. కార్యక్రమంలో మత పెద్దలు, ముస్లింలు పాల్గొన్నారు.

పక్కాగా ఈ-క్రాప్ లెక్క

- రబీలో 5,970 హెక్టార్లలో పంటలు సాగు
- ఈ- క్రాప్ నమోదు వంద శాతం పూర్తి
- 93 శాతం ఈ - కేవైసీ కూడా నమోదు
- క్షేత్ర స్థాయిలో పర్యటించి వివరాలను ప్రత్యేక యాప్‌లో నమోదు చేస్తున్న అధికారులు
- ఈనెల 15వ తేదీ వరకు గడువు



పసురపాడు వద్ద మినుము పంటలో ఈ- క్రాప్ నమోదు చేస్తున్న వ్యవసాయ సిబ్బంది

గోస్పాడు: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వ్యవసాయ రంగంలో చేపట్టిన సంస్కరణలతో రైతులకు మేలు జరుగుతున్నాయి. భూసార పరీక్షల నుంచి దిగుబడి విక్రయించే వరకు అండగా నిలుస్తుండటంతో వ్యవసాయం పండుగలా మారింది. ఇక అన్నదాతలు సాగు చేసిన పంటలు ప్రకృతి వైపరీత్యాలు, తెగుళ్లు తదితర వాటివల్ల నష్టపోతే ఆదుకోవాలని నిర్ణయించింది. పరిహారం చెల్లించేందుకు ప్రత్యేక కార్యాచరణ సైతం రూపొందించింది. ఇందుకు సాగు చేసిన పంటలను ఈ–క్రాప్ నమోదు చేయించాలని నిబంధన విధించింది. సాగు చేసిన పంటలను సర్వే నంబర్, పంట రకం, రైతు పేరు, పొలం ఖాతా, బ్యాంక్ ఖాతా నంబర్, ఆధార్ వివరాలతో ఆన్‌లైన్‌లో నమోదు చేస్తుంది. వీటి ద్వారా నష్టపోయిన పంటలకు పరిహారం చెల్లించడంతో పాటు దిగుబడి విక్రయాలకు, సబ్సిడీ, బీమాకు అర్హతగా పేర్కొంది. మండలంలో రబీలో భాగంగా వరి, జొన్న, మొక్కజొన్న, కంది, మినుము, శనగ, ఆవాలు తదితర పంటలను సాగు చేశారు. రబీలో 7,751 హెక్టార్ల సాధారణ విస్తీర్ణం కాగా 5,970 హెక్టార్లలో పంటలు సాగయ్యాయి. వీటన్నింటినీ వ్యవసాయ అధికారులు ఈ–క్రాప్‌లో నమోదు చేశారు. వంద శాతం నమోదు పూర్తయ్యింది. అలాగే మండలంలో 5,510 మంది రైతులు ఉండగా వారిలో 4,954 మంది రైతుల ఈ- కేవైసీ సైతం (93 శాతం) పూర్తిచేశారు. రైతులు సాగు చేసిన పొలాల్లోకి వ్యవసాయ సిబ్బంది స్వయంగా వెళ్లి పంటల ఫొటోలు తీసి ప్రత్యేక యాప్‌లో అప్‌లోడ్ చేసి జియో ట్యాగింగ్ చేస్తున్నారు. గతంలో మాదిరి కాకుండా పొరపాట్లకు తావివ్వకుండా జియో ఫెన్సింగ్ ఎంపిక చేసుకున్న నంబర్లలో ఫొటో తీస్తున్నారు.ప్రభుత్వం రైతులకు అందించే పథకాలన్నింటికీ ఈ–క్రాప్ నమోదు ప్రామాణికం కావడంతో చిన్నపాటి లోపాలకు ఆస్కారం లేని రీతిలో వంద శాతం నమోదు లక్ష్యంగా ముందుకు సాగుతోంది. ఈ పంట నమోదు జాబితాలను సంబంధిత ఆర్బీకేల్లో ప్రదర్శించనున్నారు.

పంటల నమోదుతో ప్రయోజనాలు..

- ఈ క్రాప్ నమోదైతే వైఎస్సార్ సున్నా వడ్డీకి అర్హత సాధించేందుకు, బ్యాంకుల ద్వారా సులువుగా పంట రుణం పొందవచ్చు
- ప్రీమియం చెల్లించకుండా ఉచితంగా పంటల బీమా పొందవచ్చు.
- విత్తనాలు, ఇతర వ్యవసాయ సబ్సిడీలు, ధరల పతన సమయంలో కనీస మద్దతు ధరతో వ్యవసాయ ఉత్పత్తులు విక్రయించుకునే అవకాశం.
- ప్రకృతి వైపరీత్యాలతో పంట నష్టపోతే ప్రభుత్వం నుంచి ఇన్‌పుట్ సబ్సిడీ అందుతుంది.
- పరిహారం దళారుల చేతిలోకి వెళ్లకుండా నేరుగా లబ్ధిదారుల ఖాతాల్లో జమ అవుతుంది.

రైతులకు ఉచితంగా బీమా



గ్రామాల్లో ఆర్‌బీకే కేంద్రాలు ఏర్పాటు చేసి వాటి ద్వారా రైతులకు అవసరమైన సేవలు ప్రభుత్వం అందజేస్తుంది. గతంలో పంటల బీమా కోసం రైతులే ప్రీమియం చెల్లించాల్సి ఉండేది. పరిహారం కూడా సకాలంలో అందేవి కాదు. ఈ ప్రభుత్వం వచ్చాక ఈ- పంట నమోదులో భాగంగా వ్యవసాయ సిబ్బంది ప్రతి పంటను ఈ- క్రాప్ నమోదు చేస్తున్నారు. ప్రభుత్వమే రైతుల తరఫున బీమా ప్రీమియం చెల్లించి విపత్తు సమయంలో దెబ్బతిన్న పైర్లకు నష్టపరిహారం చెల్లిస్తుంది. –సిద్దయ్య, రైతు, సాంబవరం

ఈ -కేవైసీ తప్పనిసరి



ఈ–క్రాప్ నమోదు చేసుకున్న రైతులు తప్పనిసరిగా ఈ - కేవైసీ చేయించుకోవాలి. ఈనెల 15వ తేదీలోగా ఈ–క్రాప్, ఈ–కేవైసీ పూర్తిచేసుకోవాలి. రైతులకు ఆర్‌బీకేలలోని వ్యవసాయ సిబ్బంది అవగాహన కల్పిస్తున్నారు. ఇప్పటికే వంద శాతం ఈ-క్రాప్ నమోదు పూర్తి కాగా ఈ-కేవైసీ 93 శాతం పూర్తి చేశాం. మిగిలిన మొత్తం గడువు లోగా నమోదు చేస్తాం.
– స్వప్నికారెడ్డి, వ్యవసాయాధికారి, గోస్పాడు

నేడు ఎమ్మెల్యే రాక

ఉయ్యాలవాడ : ఆళ్లగడ్డ ఎమ్మెల్యే గంగుల బ్రిజేంద్రారెడ్డి సోమవారం మండలం కేంద్రానికి రానున్నారని ఎంపీడీఓ రఘురాం తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ వైఎస్సార్ ఆసరా 4వ విడత వారోత్సవాల్లో భాగంగా స్థానిక గోల్డెన్ ఫంక్షన్ హాల్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో పాల్గొని మహిళలకు చెక్కు అందజేస్తారని చెప్పారు.

వ్యవసాయ విద్యుత్ వేళలు

ఉయ్యాలవాడ : మండలంలోని రైతులకు పగటి పూట 7 గంటలు ఉచిత విద్యుత్ సరఫరా చేస్తున్నట్లు ట్రాన్స్‌కో ఏఈ గురప్ప తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ సోమవారం నుంచి వారం పాటు కొండుపల్లె, ఇంజేడు, అక్కంపల్లె, హరివరం, ఎస్. కొత్తపల్లె ఫీడర్ల పరిధిలోని గ్రామాలకు ఉదయం 8 నుంచి సాయంత్రం 3 గంటల వరకు, మాయలూరు, సుద్దమల్ల ఫీడర్ల కిందనున్న గ్రామాలకు ఉదయం 11 నుంచి సాయంత్రం 6 గంటల వరకు త్రీఫేస్ విద్యుత్ సరఫరా చేస్తామని ఏఈ వివరించారు.

నేడు స్పందన

ఉయ్యాలవాడ : స్థానిక రెవెన్యూ కార్యాలయంలో సోమవారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు ప్రజల సమస్యలను తెలుసుకునేందుకు స్పందన కార్యక్రమం నిర్వహించనున్నట్లు తహసీల్దార్ వెంకటరమణ ఆదివారం తెలిపారు. గ్రామ సచివాలయాల్లో ప్రతి రోజు మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 5 గంటల వరకు స్పందన కార్యక్రమం నిర్వహిస్తారని, అక్కడ సమస్యలు పరిష్కారానికి నోచుకోకపోతే మండల కేంద్రంలో జరిగే కార్యక్రమానికి హాజరై అర్జీలు సమర్పించాలని కోరారు.

సేవలోనే ఆత్మసంతృప్తి



రక్తదాన శిబిరాన్ని ప్రారంభిస్తున్న ఎంపీ పోచా

నంద్యాల(వ్యవసాయం): సేవలోనే ఆత్మ సంతృప్తి లభిస్తుందని ఎంపీ పోచా బ్రహ్మానందరెడ్డి, ఎమ్మెల్యే శిల్పా రవిచంద్రకిశోర్‌రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం స్థానిక టౌన్‌హాల్ వద్ద ఉన్న తెలుగుతల్లి ఉద్యానవనంలోని ఆయుష్ యోగా కేంద్రంలో రక్తదాన శిబిరాన్ని ప్రారంభించి మాట్లాడారు. ఆపద సమయంలో ప్రాణాపాయం నుంచి కాపాడే రక్తదాతలను ప్రోత్సహించడం అభినందనీయమన్నారు. ఎటువంటి లాభాపేక్ష లేకుండా సేవా భావంతో ఇటువంటి కార్యక్రమాలు నిర్వహించడం గొప్ప విషయమని, తమవంతుగా సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని చెప్పారు. యోగాతో పాటు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ఆనంద్ గురూజీని అభినందించారు. అనంతరం 42 మంది రక్తదానం చేశారు. శాంతిరాం ఆసుపత్రి ఆధ్వర్యంలో ఉచిత ఈసీజీ, టుడీ ఎకో, ఎముకలు, కీళ్లు, బీపీ, షుగర్, తదితర వ్యాధులకు పరీక్షలు నిర్వహించారు. అనంతరం స్వచ్ఛంద సంస్థల అధ్యక్ష, కార్యదర్శులను సత్కరించారు. గెలివి సహదేవుడు, ఫణిల్‌కుమార్, కౌన్సిలర్ కండే శ్యాంసుందర్‌లాల్, దస్తగిరి, ఉస్మాన్‌బాషా పాల్గొన్నారు.

వైభవంగా వాసవీమాత ఆత్మార్పణ దినోత్సవం



రుద్రవరంలో అమ్మవారికి గ్రామోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం

నంద్యాల(వ్యవసాయం): స్థానిక మెయిన్ బజార్‌లో వెలసిన అమ్మవారిశాలలో శ్రీ వాసవీ కన్యకాపరమేశ్వరి దేవి ఆత్మార్పణ దినోత్సవ వేడుకలను ఆర్యవైశ్య సంఘం, వాసవీ మహిళా మండలి సభ్యుల ఆధ్వర్యంలో ఆదివారం వైభవంగా నిర్వహించారు. తెల్లవారుజామునే అమ్మవారికి సుప్రభాత సేవ నిర్వహించి 108 కలశాలతో మేళతాళాలతో చెరువు కట్ట నుంచి జలాన్ని తీసుకొచ్చి అమ్మవారిని అభిషేకించారు. అలాగే పంచామృతాభిషేకం, పలు రకాల పండ్ల రసాలు, సుగంధ ద్రవ్యాలతో కూడా అభిషేకం చేసి పట్టువస్త్రాలు, బంగారు వజ్ర కిరీటంతో అలంకరించారు. అనంతరం నగరేశ్వరస్వామికి మహాన్యాస పూర్వక ఏకరుద్రాభిషేకం చేపట్టారు. ఆర్యవైశ్య సంఘం జిల్లా అధ్యక్షుడు భవనాశి నాగమహేష్ వైశ్య పతాకావిష్కరణ గావించారు. అనంతరం అమ్మవారికి సామూహిక లక్ష కుంకుమార్చన జరిపించి మహామంగళ హారతులు పట్టి భక్తులకు తీర్థప్రసాదాలను అందజేశారు. సాయంత్రం మహిళా మండలి ఆధ్వర్యంలో సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. సంఘం నాయకులు భవనాశి శ్రీనివాస్, రామశేషు, తాడువాయి ఇందుమతి, శోభారాణి, మధుసూదనరావు, సుధాకర్, నారాయణ పాల్గొన్నారు.



వజ్ర కిరీటం అలంకరణలో కన్యకాపరమేశ్వరి

కన్యకాపరమేశ్వరికి ప్రత్యేక పూజలు

రుద్రవరం: స్థానిక కన్యకా పరమేశ్వరీ ఆలయంలో అమ్మవారికి ఆదివారం భక్తులు ప్రత్యేక పూజలు చేశారు.అమ్మవారి ఆత్మార్పణం దినోత్సవం సందర్భంగా ఆలయంలో వేద పండితులు హోమాది అభిషేకం, కుంకుమర్చాన వంటి పూజలు గావించారు. రాత్రి అమ్మవారి ఉత్సవమూర్తికి గ్రామోత్సవం జరిపించారు. పూజా కార్యాక్రమాల్లో ఆర్యవైశ్యులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

ఉపాధ్యాయ సమస్యలపై అలుపెరగని పోరాటాలు



యూటీఎఫ్ లోగో ఆవిష్కరిస్తున్న సంఘం రాష్ట్ర అధ్యక్షుడు

కర్నూలు (సిటీ) : ఉపాధ్యాయ సమస్యలపై యూటీఎఫ్ అలుపెరగని పోరాటాలు చేస్తోందని ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు నక్కా వెంకటేశ్వర్లు అన్నారు. యూటీఎఫ్‌ను స్థాపించి 50 ఏళ్ల అయిన సందర్భంగా ఆదివారం నగరంలోని సిల్వర్‌జూబ్లీ కళాశాలలో స్వర్ణోత్సవ సంబరాలు నిర్వహించారు. సంఘం పతాకాన్ని రాష్ట్ర సహాధ్యక్షుడు సురేష్ కుమార్ ఆవిష్కరించారు. అనంతరం ముఖ్య అతిథిగా హాజరైన వెంకటేశ్వరు మాట్లాడుతూ పాత పెన్షన్ విధానం సాధించే విడతల వారీగా ఉద్యమాలు చేస్తామన్నారు. కార్యక్రమంలో యూటీఎఫ్ మాజీ రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు నరసింహులు, యూటీఎఫ్ సంఘం తొలి జిల్లా ప్రధాన కార్యదర్శి, రవీంద్ర విద్యాసంస్థల వ్యవస్థాపకులు జి.పుల్లయ్య, ఆ సంఘం సభ్యులు ప్రసంగించారు. కార్యక్రమంలో యూటీఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు రవికుమార్, నవీన్ పాటి, రాష్ట్ర నాయకులు నాగమణి, యల్లప్ప, నంద్యాల జిల్లా కార్యదర్శి సుధాకర్, సీఐటీయూ నాయకులు రామాంజనేయులు, జనవిజ్ఞాన వేదిక నాయకులు సుధీర్ రాజు తదితరులు పాల్గొన్నారు.

బేతేశ్వర ఆలయ పునర్నిర్మాణానికి భూమిపూజ



నూతన ఆలయ నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న గ్రామస్తులు

కొత్తపల్లి: మండల పరిధిలోని ముసలిమడుగు గ్రామంలో ఆదివారం గ్రామస్తుల ఆధ్వర్యంలో బేతేశ్వర స్వామి ఆలయ పునఃనిర్మాణానికి భూమిపూజ చేశారు. గ్రామంలో ఎన్నో శతాబ్దాల చరిత్ర కలిగిన ఈ ఆలయం శ్రీశైలం ప్రాజెక్ట్ నిర్మాణంలో మునిగిపోయింది. దీంతో ఆలయాన్ని నూతనంగా నిర్మించుకునేందుకు పనులు ప్రారంభించామని గ్రామస్తులు తెలిపారు. ఈ ఆలయ నిర్మాణానికి దేవదాయ శాఖ నుంచి రూ.80లక్షలు మంజూరు అయ్యాయన్నారు. ఈ మొత్తంతో పాటుగా రూ.20 లక్షలు ఆలయ నిర్మాణం కోసం దేవదాయ శాఖలో డిపాజిట్ చేశామని.. మొత్తం కోటీ రూపాయాలతో ఆలయ నిర్మాణం చేపడుతున్నట్లు ఆలయ కమిటీ నిర్వాహకుడు నాగరాజు తెలిపారు. భక్తులు, ప్రజల సహకారంతో ఆలయ నిర్మాణం త్వరగా పూర్తిచేయిస్తామని అన్నారు. శ్రీనివాసులు, పెద్దలింగస్వామి పాల్గొన్నారు.

నంద్యాలకు ఏం చేశారో చెప్పగలరా?



షాపింగ్ కాంప్లెక్స్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే శిల్పారవి, మార్కెట్ యార్డు చైర్మన్ మహేశ్వరరెడ్డి

- నాడు టీడీపీ నాయకులు మాటలతో ప్రజలను మోసం చేశారు
- ఎమ్మెల్యే శిల్పారవి ధ్వజం
- వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో మారిన నంద్యాల రూపు రేఖలు
- రూ.60 లక్షలతో నిర్మించిన షాపింగ్ కాంప్లెక్స్ ప్రారంభం

నంద్యాల(సిటీ): నంద్యాల పట్టణాకి టీడీపీ నాయకులు ఏం చేశారో చెప్పుకునే ధైర్యం ఉందా అని ఎమ్మెల్యే శిల్పా రవిచంద్రకిశోర్‌రెడ్డి ప్రశ్నించారు. ఆదివారం స్థానిక నూనెపల్లె మార్కెట్ యార్డులో రూ.60 లక్షలతో నిర్మించిన షాపింగ్ కాంప్లెక్స్‌ను మార్కెట్ యార్డు చైర్మన్ మహేశ్వరరెడ్డి, ఎమ్మెల్సీ ఇసాక్ బాషాతో కలిసి ప్రారంభించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ మార్కెట్ యార్డులో షాపింగ్ కాంప్లెక్స్ నిర్మించడం హర్షనీయమన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో నంద్యాల రూపురేఖలు మారిపోయాయన్నారు. గత నాలుగేళ్లల్లో రూ.10 కోట్లతో నంద్యాల పట్టణాన్ని అభివృద్ధి చేశామని చెప్పారు. మార్కెట్ యార్డు అభివృద్ధికి షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణం ఎంతో దోహదం చేస్తుందన్నారు. వీటి నుంచి ఆదాయం సమకూరుతుందనే ఆలోచనతో నిర్మాణం చేపట్టామన్నారు. రైతుల సంక్షేమం కోసం మిర్చియార్డును ఏర్పాటు చేయాలని సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని కోరగా వెంటనే మంజూరు చేశారన్నారు. నంద్యాల అభివృద్ధి మొత్తం కేవలం వైఎస్సార్‌సీపీ హయాంలో జరిగిందని చెప్పుకునేందుకు గర్వంగా ఉందన్నారు. నాడు కేవలం మాటలతో మభ్య పెట్టి ప్రజలను మోసం చేశారని మండిపడ్డారు. ఇచ్చిన హామీలు నెరవేర్చకుండా కాలం గడిపారన్నారు. నేడు తాము ఇచ్చిన మాటకు కట్టుబడి పనులు చేస్తూ ఆదర్శంగా నిలిచామన్నారు. కోల్డ్ స్టోరేజ్ ఏర్పాటుకు ప్రతిపాదనలు పంపామని చెప్పారు. ఏపీపీఎస్సీ మెంబర్ సిద్ధం శివరాం, మున్సిపల్ చైర్‌పర్సన్ మాబున్నిసా, దృశ్య కళల డైరెక్టర్ సునీత అమృతరాజ్, ఏపీఎస్సీడీసీఎల్ డైరెక్టర్ శశికళరెడ్డి, మార్కెట్ యార్డు వైస్ చైర్మన్‌నాగన్న, నాయకులు పార్థుడు, అమృతరాజ్, శంకర్‌నాయక్, కత్తిశంకర్, మునయ్య, రవి, అప్పన్న గౌడ్, జలీల్, బాలపక్కిరయ్య, మార్కెట్ యార్డు డైరెక్టర్లు పాల్గొన్నారు.

98 డీఎస్సీ క్వాలిఫైడ్స్‌కు న్యాయం చేయాలి



ఎంపీ పోచాకు వినతి పత్రం ఇస్తున్న దృశ్యం

నంద్యాల(అర్బన్): 98 డీఎస్సీలో మిగిలిపోయిన క్వాలిఫైడ్స్‌కు ఉద్యోగాలు ఇవ్వాలని 98 డీఎస్సీ రిమైనింగ్ క్వాలిఫైడ్స్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీనివాసులు కోరారు. ఈ మేరకు నంద్యాల ఎంపీ పోచా బ్రహ్మానందరెడ్డిని ఆయన నివాసంలో కలిసి వినతి పత్రం అందజేశారు. శ్రీనివాసులు మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాదయాత్రలో క్వాలిఫైడ్‌లందరికీ న్యాయం చేస్తామని హామీ ఇచ్చారని గుర్తు చేశారు. గత ఏడాది 4వేల మందికి ఉద్యోగ అవకాశాలు కల్పించారని, అందులో రిజర్వేషన్ పాటించకపోవడంతో ఎస్సీ,ఎస్టీ, బీసీ, మైనార్టీ, మహిళలు ఉద్యోగ అవకాశాలు కోల్పోయారన్నాని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం మానవతా దృక్పథంతో స్పందించి మిగిలిన వారందరికీ ఉద్యోగ అవకాశాలు కల్పించాలని విజ్ఞప్తి చేశారు. వచ్చే వారంలో విజయవాడకు వెళ్తున్నాని, తన వెంట వస్తే మీ సమస్యకు పరిష్కారం చూపుతానని ఎంపీ పోచా హామీ ఇచ్చారన్నారు. నాయకులు చిన్ని కృష్ణుడు, సంజీవ, భాగ్యమ్మ, కృష్ణమూర్తి పాల్గొన్నారు.

కొలనుభారతిలో పటిష్ట భద్రత



కొలనుభారతిలో ఆలయ సిబ్బంది, పోలీసులకు సూచనలులిస్తున్న సీఐ

కొత్తపల్లి: మండలంలోని పవిత్ర పుణ్యక్షేత్రమైన శ్రీ కొలనుభారతి దేవి ఆలయంలో వసంతపంచమి వేడుకల్లో ఎటువంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా పటిష్ట భద్రతా చర్యలు తీసుకుంటామని ఆత్మకూరు రూరల్ సీఐ నాగభూషణ్ తెలిపారు. ఆదివారం మండలంలోని శివపురం సమీపంలోని కొలనుభారతి దేవి ఆలయంలో వసంతపంచమి ఏర్పాట్లను పరిశీలించారు. ముందుగా అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయ పరిసరాలను, ఎక్కడెక్కడ పోలీసు భద్రత అవసరం, వాహనాల పార్కింగ్ స్థలాన్ని, ట్రాఫిక్ అంతరాయం కలగకుండా చేయాల్సిన ఏర్పాట్లపై ఇన్‌చార్జ్ ఎస్‌ఐ అశోక్, ఈఓ మోహన్‌ను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఈనెల 14న అమ్మవారి పుట్టిన రోజు సందర్భంగా నిర్వహించనున్న వసంత పంచమి వేడుకల్లో భక్తులకు, సందర్శకులకు, ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా భారీ బందోబస్తు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. భక్తుల సౌకర్యార్థం శివపురం గూడెంవద్ద వాహనాల పార్కింగ్ నిర్వహిస్తామని, అక్కడి నుంచి భక్తులను ప్రత్యేక బస్సుల్లో ఆలయం వద్దకు తరలిస్తామన్నారు. భక్తులు అధికారులకు సహకరించాలని కోరారు. ఆయన వెంట సర్పంచు చంద్రశేఖర్ యాదవ్, పాలకమండలి చైర్మన్ వెంకట నాయుడు, ఏఎస్‌ఐ వెంకటేశ్వర్లు, మాజీ సర్పంచు శ్రీనివాసులు యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

బిల్లులు వసూలు చేయాలి

గోస్పాడు: వినియోగదారుల నుంచి విద్యుత్ బిల్లులు సకాలంలో వసూలు చేయాలని ఏఈ జ్ఞానసూర్యుడు తెలిపారు. స్థానిక విద్యుత్ సబ్‌స్టేషన్‌లో ఆదివారం సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఎక్కడ విద్యుత్ సమస్యలు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. గ్రామాల్లో బిల్లుల చెల్లింపుపై ప్రజలకు అవగాహన కల్పించి త్వరగా చెల్లించేలా చూడాలన్నారు. మీటరు లేకుండా విద్యుత్ వినియోగిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని చెప్పారు. లైన్ ఇన్‌స్పెక్టర్ ఆనందరావు, సిబ్బంది పాల్గొన్నారు.

పెద్దమ్మకు ప్రత్యేక పూజలు

దొర్నిపాడు: మండలంలోని డబ్ల్యూ గోవిందిన్నె గ్రామంలో వెలసిన మూలపెద్దమ్మ అమ్మవారికి ఆదివారం ప్రత్యేక పూజలు చేశారు. ఉదయమే అమ్మవారిని నూతన పట్టు వస్త్రాలతో అలంకరించి అభిషేకాలు, హారతులు పట్టారు. పలువురు భక్తులు నైవేద్యం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు.

శ్రీశైలం దేవస్థాన ఉద్యోగుల ఔదార్యం

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల దేవస్థానంలో విధులు నిర్వహిస్తున్న కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు తమ ఔదార్యాన్ని చాటుకున్నారు. ఇటీవల కాలంలో దేవస్థాన ఆలయ విభాగంలో భజంత్రీగా విధులు నిర్వహిస్తున్న ఎ.డి.వి.లక్ష్మయ్య గుండెపోటుతో మరణించడంతో వారి కుటుంబ సభ్యులకు దేవస్థాన కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల సంఘం తరుపున మృతుని భార్యకు రూ.2,51,399 ఆర్థిక సహాయాన్ని అందించారు. ఆదివారం శ్రీశైలంలోని దేవస్థాన పరిపాలన భవనంలో మృతుని భార్యకు దేవస్థాన ఈఓ డి.పెద్దిరాజు చేతుల మీదుగా చెక్కును అందజేశారు. కార్యక్రమంలో దేవస్థాన ఔట్‌సోర్సింగ్, కాంట్రాక్ట్ ఉద్యోగుల సంఘం అధ్యక్షులు బాలాజీ నాయక్ ఉన్నారు.

కళకళలాడుతున్న రబీ పంటలు



గోస్పాడు సమీపంలో సాగైన జొన్నపైరు



ఎం.చింతకుంట్ల వద్ద పచ్చగా వరిపైరు





జూలేపల్లె వద్ద కళకళలాడుతున్న మిరప పైరు, ఎస్.నాగులవరంలో మిరుమిట్లు గొలుపుతున్న ఆవాల పంట

గోస్పాడు: మండల పరిధిలోని గ్రామాల్లో సాగు చేసిన రబీ పంటలు కళకళలాడుతున్నాయి. ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌లో వర్షాలు అంతంత మాత్రంగానే కురిసినా సకాలంలో కేసీ కాల్వకు నీరు అంది ఖరీఫ్ పంటలో ఆశించిన మేర రైతులు దిగుబడులు సాధించారు. కోతల అనంతరం రెండో పంటగా జొన్న 4,435 హెక్టార్లలో, మొక్కజొన్న 82 హెక్టార్లు, కంది 31 హెక్టార్లు, మినుము, 582 హెక్టార్లు, శనగ 621 హెక్టార్లు, ఆవాలు 192 హెక్టార్లలో సాగు చేశారు. దీంతో పాటు గతంలో సాగు చేసిన మిరప పంటలో పండు మిరప కోతలు సాగుతున్నాయి. ఆవాల పైరు ప్రస్తుతం పూత దశలో ఉండటంతో అటువైపు వెళ్లే వారికి అహ్లాదకరంగా కనువిందు చేస్తుంది. వాతావరణం అనుకూలించడంతో చీడపీడల బెడద తగ్గడంతో కొంత మేర ఖర్చులు తగ్గాయని రైతులు చెబుతున్నారు.